మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు



నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో నోటీసు ఇస్తున్న కార్మికులు

మణికొండ: కార్మికుల హక్కుల పరిరక్షణలో భాగంగా ఈనెల 16న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెలో తాము పాల్గొంటున్నామని నార్సింగి మున్సిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో మంగళవార నోటీసు అందించారు. అనంతరం సీఐటీయూ మండల కన్వీనర్ డి. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మహిపాల్, కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, నాయకులు అహ్మద్, వంశీ, రాహుల్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి

శంషాబాద్: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో క్యాబ్ డ్రైవర్లు, ఎయిర్‌పోర్టు గ్రౌండ్ హ్యాండ్లింగ్ సిబ్బందికి మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్‌కు పాటించకపోవడంతో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతుందన్నారు. నిబంధనలు పాటించడంతో పాటు ఇతరులకు కూడా సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రాజు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



యోగా గురువు బాల కామేశ్వరిని సన్మానిస్తున్న నిర్వాహకులు

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా పంచాయతీరాజ్ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో అత్తాపూర్‌కు చెందిన యోగా గురువు బాల కామేశ్వరిని మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అత్తాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో బాల కామేశ్వరి మాట్లాడుతూ.. యేటా పంచాయతీరాజ్ శాఖ రంగారెడ్డి జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తారన్నారు. ఈ యేడ వేడుకల్లో తాను ఉద్యోగులకు యోగా శిక్షణతో పాటు వివిధ ఆటల పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని విజేతలుగా నిలిచారన్నారు. సంఘం కన్వీనర్ దర్శన్ గౌడ్, కన్వీనర్ చంద్రన్న ఆధ్వర్యంలో తనను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు.

మహావీర్ కళాశాలలో సెమినార్



అత్తాపూర్: బండ్లగూడలోని మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ''ప్రాడక్ట్ మార్కెటింగ్‌లో సమస్యలు, పరిష్కారాలు'' అనే అంశంపై మంగళవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు వర్క్‌షాపు, సెమినార్లను సద్వినియోగం చేసుకొని ఉద్యోగావకాశాలు పొందాలని సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఎంఈసీ హెచ్-ఇ-యుకే సెక్రటరీ ఎం.వి.ఆదిత్య నాగ్ హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషశ్రీ, ఐఏసీ కో-ఆర్డినేటర్ వివి.ప్రతిభా భారతి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల వాడకం తగ్గించాలి

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



గచ్చిబౌలి: ప్లాస్టిక్ కవర్ల వాడకం తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని మాజీ ఎంపీ, బీజేపీ నాయకులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొండాపూర్‌లోని మైహోం మంగళ రోడ్డులో కూరగాయల మార్కెట్‌లో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవికుమార్‌యాదవ్‌తో కలిసి జ్యూట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. పర్యావరణం కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని గుర్తు చేశారు. పర్యావరణం కాలుష్యం బారిన పడటంతో ప్రకృతి సమతౌల్యం దెబ్బతింటుందన్నారు. బీజేపీ నాయకులు ఎల్లేష్, ఆంజనేయులు, శ్రీధర్, రమేష్, రవినాయక్, శ్రీశైలం, కుమార్‌యాదవ్, సాగర్, శ్రీకాంత్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న నేషనల్ హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పో గాంధీ బుణకర్‌మేళలో భాగంగా మంగళవారం యాంఫిథియేటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను నగరవాసులు విరివిగా కొనుగోలు చేశారు. సంస్కృతి ముదాల్కర్ శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనను ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు. పుష్పాంజలి, బ్రహ్మాంజలి, అష్టపది, జతిస్వరం, మరకతమణిమయ తదితర అంశాలను కళాకారులు పవిక, అద్విత, మీనాక్షి, షణ్ముఖప్రియ, మమతా, శ్రేష్ఠ, శ్రవంతి, స్ఫూర్తి పాల్గొని ప్రదర్శించారు. ప్రముఖ నాట్య గురువులు వాణిరమణ ముఖ్య అతిథిగా హాజరై కళాకారులను ఆశీర్వదించారు.

మంచిరేవులలో ఘనంగా ఎల్లమ్మ బోనాలు



రేణుకా ఎల్లమ్మ కల్యాణం నిర్వహిస్తున్న ఒగ్గు కళాకారులు



ఆలయానికి బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల గ్రామంలో మూడు రోజులుగా కొనసాగుతున్న మల్లన్న, బీరప్ప ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రేణుకా ఎల్లమ్మ కల్యాణం, బోనాలు, నాగవెల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. శివసత్తులు శిగాలు, డోలు చప్పుళ్లు, పోతురాజులు ముందు నడవగా మహిళలు సామూహికంగా బోనాలతో గ్రామం నుంచి ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల పాటలతో గ్రామం మారుమోగింది. రాత్రికి నాగవెల్లి బోనాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎం. ప్రవీణ్‌యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, కౌన్సిలర్లు నాగపూర్ణ శ్రీనివాస్, లంకల పద్మవీరారెడ్డి, నాయకులు దశరథయాదవ్, భగవాన్‌రెడ్డి, డి.లక్ష్మణ్, ఆలయ కమిటీ చైర్మన్ ఎం.శ్రీనివాస్ యాదవ్, వైస్ చైర్మన్ డి.భాస్కర్ కురుమలు పాల్గొన్నారు.

ఓంనగర్ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి



అసిస్టెంట్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

బండ్లగూడ: ప్రజల సౌకర్యార్థం విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని ఓంనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు విద్యుత్ అధికారులను కోరారు. ఈ మేరకు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓంనగర్ కాలనీలో నెలకొన్న సమస్యపై టీఎస్ఎస్‌పీడీసీఎల్ కిస్మత్‌పూర్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.నవీన్‌కుమార్ మాట్లాడుతూ కాలనీలో ఇంటర్ పోల్స్, 11కేవీ పోల్స్, షిఫింగ్, త్రీఫేజ్ వైరింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో పాత స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని విన్నవించారు. అలాగే దిమ్మెలను ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్లను బిగించాలని కోరారు. ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారులు కూడా సానుకూలంగా స్పందించారని త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

బాల్క సుమన్ దిష్టి బొమ్మ దహనం



మణికొండ బటర్‌ఫ్లై సర్కిల్‌లో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మణికొండ: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. జితేందర్, కార్య నిర్వాహక అధ్యక్షుడు ఎస్. ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో అలకాపూర్ బటర్‌ఫ్లై సర్కిల్‌లో మంగళవారం బాల్క సుమన్ దిష్టిబొమ్మకు చెప్పుల దండ వేసి ఊరేగించి, ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేసి దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమని, అలాంటిది పూర్తి స్థాయిలో వ్యక్తిగత దూషణలకు దిగడం సరైనా పద్ధతి కాదన్నారు. వెంటనే పోలీసులు బాల్క సుమన్‌ను అరెస్టు చేసి చట్ట పరమైన చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కె. లక్ష్మీనారాయణ, పురుషోత్తం, బి. పద్మారావు, కో ఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు కస్తూరి సతీశ్‌ముదిరాజ్, అహ్మద్ షా ఖాన్, షేక్ హాజీ, రమేశ్, మహేశ్‌రెడ్డి, శివ, కె.శ్రావణ్, శరత్, బాబుజానీ, ప్రవీణ్‌కుమార్, ప్రభావతి, మహేందర్‌రెడ్డి, పవన్, ఆకాశ్, ప్రదీప్, భరత్, షానవాజ్, శ్రీకాంత్, గణేశ్, నరేందర్ పాల్గొన్నారు.

దర్జాగా కబ్జా..!

- రాళ్లగూడలో రోడ్డుకు అడ్డంగా ప్రహరీ నిర్మాణం
- రాకపోకలకు కాలనీవాసుల ఇబ్బందులు
- మున్సిపాలిటీ అధికారులకు విన్నవించినా పట్టించుకోని వైనం



రాళ్లగూడలో రోడ్డుకు అడ్డంగా నిర్మించిన ప్రహరీ

శంషాబాద్: లేఅవుట్‌లో స్పష్టంగా ఉన్న రోడ్డునే కబ్జా చేసి ఏకంగా ప్రహరీనే నిర్మించారు కబ్జారాయుళ్లు. పట్టణంలోని రాళ్లగూడలో గల 14 వార్డు పరిధి సర్వేనంబర్ 572లో ఉన్న లేవుట్‌లో కొందరు స్థానికులు నివాసముంటున్నారు. దీనికి సంబంధించిన లేఅవుట్‌లో ఉన్న రోడ్డును 15 రోజుల క్రితం కొందరు కడీలు పాతడంతో పాటు మట్టిపోశారు. ఈ విషయమై జనవరి 24 న కాలనీవాసులు కొందరు వ్యక్తులు రోడ్డును మూసివేస్తున్నారని దీంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మున్సిపాలిటీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అయినా ఇప్పటివరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపాలిటీ. పట్టణ ప్రణాళికా, ఇంజినీరింగ్ విభాగం అధికారులను సాక్షి వివరణ కోరగా లేఅవుట్ ఆధారంగా పరిశీలించి అక్కడ రోడ్డు ఉంటే ప్రహరీని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

లేబర్ చట్టాలతో కార్మికులు దోపిడీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.చంద్రయ్య

రాజేంద్రనగర్: కేంద్రం ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లు కార్మిక దోపిడీ సాధనాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడ బి.చంద్రయ్య అన్నారు. రాజేంద్రనగర్‌ని జిల్లా కార్యాలయంలో మంగళవారం జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ.. రైతులు, వ్యవసాయ, ఇతర కార్మికులు తమ సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 16న తలపెట్టిన దేశ వ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కార్మిక నాయకత్వం ప్రజల్లోకి వెళ్లి విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని, వాటికి అనుగుణంగా కార్మికుల జీతాలు పెరగడం లేదన్నారు. కార్యక్రమంలో కె.రామస్వామి, టంగుటూరి నరసింహా రెడ్డి, ఎస్.మల్లేశ్, జైపాల్ రెడ్డి, చందు యాదవ్, సత్యనారాయణ, దత్తు నాయక్ పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన

గోల్కొండ: తన దృష్టికి వచ్చిన ప్రతి చిన్న సమస్యను కూడా పరిష్కరించడానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి ఫిర్యాదులను ఆయన విన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడంతో పాటు సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాన్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో ప్రతి ఇంటికి నీరు అందేలా జలమండలి అధికారులతో ప్రణాళిక సిద్ధం చేశానని అన్నారు. లోప్రెషర్ నీటి నరఫరా ప్రాంతాలను గుర్తించి పలు ప్రాంతాల్లో బూస్టర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హబీబ్ చౌస్, మిర్జా ఎక్బాల్ అహ్మద్, అమీరుద్దీన్, జబ్బార్ తదితరులున్నారు.

అత్తాపూర్ ఎస్సైగా బాధ్యతల స్వీకరణ

అత్తాపూర్: అత్తాపూర్ ఎస్సైగా సీహెచ్. శ్రీను మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఎస్సైగా కుప్పగిరి లింగం బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో తలకొండపల్లిలో ఎస్ఐగా పని చేసిన శ్రీను ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సైగా మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ విధి నిర్వహణలో ఎలాంటి పక్షపాత వైఖరి లేకుండా చట్ట ప్రకారం పని చేస్తానని పేర్కొన్నారు.

సీఎంపై బాల్కసుమన్ వ్యాఖ్యలు తగవు

అత్తాపూర్: ప్రజలు మార్పును కోరుకొని కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని.. ఎవరికీ వారు ఇష్టారాజ్యంగా సీఎం స్థాయి వ్యక్తులను దూషించడం, ఆరోపణలు చేయడం సరైంది కాదని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మంగళారం గోవర్ధన్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యమ నాయకులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థిగా, గతంలో ఎంపీ, ఎమ్మెల్యేగా ఎన్నికైన మాజీ నాయకుడు బాల్క సుమన్ వ్యవహార శైలి, పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. రాష్ట్రంలో కుటుంబ పాలనకు వ్యతిరేకంగా ఓటు వేసేందుకు నిర్ణయం తీసుకొని ఉన్నారని.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ మెజార్టీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: మణికొండ క్వార్టర్స్ హనుమాన్ ఆలయం ఎదుట మున్సిపల్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యతతో చేపట్టి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఒక్కసారి సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాక వాటిని కనీసం ఐదేళ్ల పాటు తవ్వేందుకు అనుమతులు ఇవ్వద్దని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు సి.బీరప్ప, నాయకులు రవీకాంత్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

రాజేంద్రనగర్: విద్యుదాఘాతానికి గురై ఓ కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్‌కు చెందిన సలీం మియా (28) నగరానికి వలస వచ్చాడు. చాంద్రాయణగుట్ట ప్రాంతంలో ఉంటూ విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. రాజేంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఉప్పర్‌పల్లి రెడ్డి బస్తీ ప్రాంతంలో సోమవారం సాయంత్రం విద్యుత్ సరఫరాను నిలిపివేసి పనులు చేపడుతున్నారు. స్తంభంపై మరమ్మతులు చేపడుతుండగా విద్యుత్ షాకు గురై సలీం మియా తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కార్మికులు హుటాహుటినా ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. విద్యుత్ లైన్‌ను ఆపివేసి కరెంట్ సరఫరా ఎలా అయిందో అన్నదానిపై ప్రస్తుతం ఆ శాఖ అధికారులు విచారణ చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

10, 11 తేదీల్లో ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం (టీఎస్‌సీఏ) ఆధ్వర్యంలో ఈనెల 10, 11వ తేదీల్లో రాష్ట్ర ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీ జరగనుంది. లాల్‌బహదూర్ స్టేడియంలోని యోగా హాల్‌లో ఈ టోర్నీని నిర్వహిస్తారు. ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో టాప్-2లో నిలిచిన వారు వచ్చే నెలలో పుణేలో జరిగే జాతీయ ర్యాపిడ్, బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని టీఎస్‌సీఏ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ తెలిపారు. ఆసక్తిగలవారు తమ పేర్లను ఈనెల 8వ తేదీలోపు www.chesstelangana.com వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలి. స్పాట్ ఎంట్రీలను స్వీకరించరు. ఇతర వివరాలకు 73375 78899, 73373 99299 లలో నిర్వాహకులను సంప్రదించాలి.

వందశాతం ఆస్తిపన్ను వసూలు చేయాలి



దర్గాఖలీజ్‌ఖాన్‌లో ఆస్తి పన్ను వసూలు కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు ఆస్తిపన్నును సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని దర్గాఖలీజ్‌ఖాన్, సంధ్యానగర్ కాలనీ, సబితాఇంద్రారెడ్డి కాలనీలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో భాగంగా వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలన్నారు. అందులో భాగంగా అధికారులు, సిబ్బంది 22 బృందాలుగా ఏర్పడి 22 డివిజన్లలో పని చేస్తున్నారన్నారు. ప్రతిరోజు అధికారులు, సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి వసూలు చేస్తారన్నారు. అలాగే కార్పొరేషన్ కార్యాలయంలో సైతం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయన వెంట అధికారులు, సిబ్బంది, ప్రజలు ఉన్నారు.

అలకాపూర్‌లో సమస్యలు పరిష్కరించండి



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న అలకాపూర్ నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంశీ మాట్లాడుతూ అలకాపూర్ టౌన్‌షిప్‌లో గల రెండు చెరువుల్లో గుర్రపుడెక్క పెరిగిపోవడంతో దోమల ఉధృతి విపరీతంగా పెరిగిందన్నారు. అలాగే ప్రజావసరాలకు వాడుకునేలా కమ్యూనిటీ హాల్ నిర్మించాలని రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టాలని, రోడ్ల ఆక్రమణలను తొలగించాలని, పార్కుల్లో సౌకర్యాలు మరింత మెరుగుపర్చాలని, నార్సింగి మున్సిపాలిటీ కేంద్రానికి నిర్మిస్తున్న 100 ఫీట్ల రోడ్డు పనులు మధ్యలోనే నిలిచిపోయాయని, వెంటనే వాటిని పూర్తి చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు శంకర్ దేవ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఐకి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



సీఐకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న జైపాల్‌రెడ్డి తదితరులు

మణికొండ: నార్సింగి పోలీస్‌స్టేషన్ సీఐగా వచ్చిన జి.హరికృష్ణారెడ్డిని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతలను పరిరక్షించాలని, అందుకు తమ సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ముంగి జైపాల్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ విజయ్‌బాబు, బీఆర్ఎస్ కౌన్సిలర్ జి.శివారెడ్డి, నాయకులు ఓం ప్రకాశ్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

ప్రతీ వందేళ్లకు కొత్త సవాళ్లను ఎదుర్కొంటాం..

'మనూ' వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్

రాయదుర్గం: ప్రతి వందేళ్లకు మనం కొత్త సవాళ్లను ఎదుర్కొంటామని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ డెవలప్‌మెంట్ డైనమిక్స్ ఇన్ ఇండియా' అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సును ఆయన అధ్యక్షత వహించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రస్తుతం మనం 2047 శతాబ్దిలో ఈ దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చే కొత్త సవాలుకు మనల్ని మనం సిద్ధం చేసుకోవాలన్నారు. ఇది క్షణ్ణంగా స్నేహం చేయడం, అడ్డంకులను ఛేదించుకోవడం, ఎవరినీ వదలకుండా ప్రతి ఒక్కరినీ కలుపుకోవడం సాధ్యమవుతుందన్నారు. న్యూఢిల్లీ సెంటర్ ఫర్ పబ్లిక్ పాలసీ అండ్ గవర్నెన్స్ హెడ్ ప్రొఫెసర్ రుమ్కీబసు, ఆదాయపన్ను అసిస్టెంట్ కమిషనర్, ఐఆర్ఎస్ అధికారి డాక్టర్ వసీముర్ రెహమాన్‌లు మాట్లాడారు. అనంతరం సెమినార్ సావనీర్‌ను వైస్‌చాన్స్‌లర్ విడుదల చేశారు. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఫరీదా సిద్దిఖీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అధిపతి, సెమినార్ కన్వీనర్ డాక్టర్ సయ్యద్ నజియుల్లా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అహ్మద్ రజా, లీగల్ స్టడీస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుధాంశు చంద్ర ప్రసంగించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన ప్రతినిధులు తమ పత్రాలను అందజేశారు.

'మనూ'లో ఆడియో- విజువల్ ఆర్కైవింగ్‌పై వర్క్‌షాప్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ విశ్వవిద్యాలయంలో ఆడియో-విజువల్ ఆర్కైవింగ్‌పై వర్క్‌షాప్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 'మనూ'లోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్, నేషనల్ కల్చరల్ ఆడియో విజువల్ ఆర్కైవ్స్ (ఎన్‌సీఏఏ), ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ (ఐజీఎన్‌సీఏ) సంయుక్త సహకారంతో ఫిబ్రవరి 21-23 మధ్యన ఆడియో-విజువల్ ఆర్కైవింగ్‌పై మూడ్రోజులపాటు వర్క్‌షాప్‌ను నిర్వహిస్తుంది. ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహమద్, ఎన్‌సీఏఏ కల్చరల్ ఇన్ఫర్మేటిక్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రతాపానంద్‌జా, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఇర్ఫాన్ జుబైరిలు పర్యవేక్షిస్తారు.

స్పెక్ట్రో ఫోటో మీటర్- బేసిక్‌పై ..

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో యూవీ-వీఐఎస్ స్పెక్ట్రో ఫొటో మీటర్-బేసిక్‌పై ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. 'మనూ'లోని స్కూల్ ఆఫ్ సైన్సెస్ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎస్ఐఆర్-ఐఐసీటీ సీనియర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ ప్రకృతి రంజన్‌బంగల్ యూవీ-వీఐఎస్ స్పెక్ట్రో ఫొటో మెట్రీ వెనుక, అణువులతో కాంతి వరస్పర చర్యపై అవగాహన కల్పించారు. కెమిస్ట్రీ, బయోకెమిస్ట్రీ రంగాల్లో దీని ప్రభావం గురించి వివరించారు. అనంతరం విద్యార్థుల పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. అనంతరం ల్యాబ్‌లో హ్యాండ్ ఆన్ సెషన్స్ యూవీ-వీఐఎస్ విధులను తెలుసుకోవడానికి పాల్గొనే వారికి అవకాశం కల్పించేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ సల్మాన్ అహ్మద్‌ఖాన్, డాక్టర్ అలీముద్దీన్, డాక్టర్ ఖాసీముల్లా, విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టుకు ఏడో విజయం

సాక్షి, హైదరాబాద్: ఐ-లీగ్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) ఏడో విజయం నమోదు చేసింది. గోవాలోని తిలక్ మైదాన్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 2-1 గోల్స్ తేడాతో చర్చిల్ బ్రదర్స్ జట్టును ఓడించింది. శ్రీనిధి జట్టు తరఫున డేవిడ్ కాస్టనెడా మునోజ్ (11వ ని.లో), ఎలీ సాబియో ఫిలో (90+4వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... చర్చిల్ బ్రదర్స్ జట్టుకు కరీమ్ (88వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. 13 జట్లు పోటీపడుతున్న ఐ-లీగ్‌లో 12 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న శ్రీనిధి జట్టు 23 పాయింట్లతో రియల్ కశ్మీర్ జట్టుతో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో ఉంది.

మాదాపూర్‌లో 'లైవ్ పాప్సికల్'

సాక్షి, సిటీబ్యూరో: అప్పటికప్పుడు సహజమైన పండ్ల సమ్మేళనాలతో డెజర్ట్ (లైవ్ పాప్సికల్స్) తయారు చేసి అందించే ఓ కేఫ్ మాదాపూర్‌లో అందుబాటులోకి వచ్చింది. స్కూజో ఐస్ 'ఓ' మ్యాజిక్ పేరుతో హైటెక్ సిటీ రోడ్ మాదాపూర్ వేదికగా ఈ వినూత్న డెజర్ట్ కేఫ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ కె.చంద్ర శేఖర్ రెడ్డి, స్కూజో వ్యవస్థాపకుడు గగన్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.